# నేను పనికొస్తా.. అనుకుంటే ఓటెయ్యండి!

### సిరిసిల్లలో యువ ఆత్మీయ సమ్మేళనంలో ఓటర్లకు కెటిఆర్ పిలుపు

సిరిసిల్ల  కులం, మతం కాదు, గుణం చూసి ఓటెయ్యండి అని కేటీఆర్ పిలుపునిచ్చారు. అభివృద్ధి నా కులం, సంక్షేమం నా మతం. నేను పని చేస్తాను అనుకుంటేనే నాకు ఓటెయ్యండి అని కోరారు మంత్రి కేటీఆర్. సిరిసిల్ల పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ యువ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో యువకులు, బీఆర్ఎస్ యూత్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. 'ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు.. అదే సోషల్ మీడియాలో సమాధానాలు చెప్పండి.. గతంలో సిరిసిల్లకు ఇప్పటి సిరిసిల్లకు తేడాను సోషల్ మీడియాలో ప్రచారం చేయండి.. సిరిసిల్ల ఒకప్పుడు ఉరిసిల్లగా ఉండే.. కానీ, ఇప్పుడు ఎలా అభివృద్ధి చెందిందో తెలపండి' అని ఆయన అన్నారు. నేతన్న ఆత్మహత్య వద్దంటూ రాతలు సిరిసిల్ల గోడలపై ఉండేవి.. సిరిసిల్లలో ఇన్ని విద్యాసంస్థలు వస్తాయని కళలో కూడా ఎవరూ అనుకోలేదు.. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు అందరు సిరిసిల్ల, గజ్వేల్ లోనే అభివృద్ధి అంటుంటే, సిరిసిల్ల నాయకులు మాత్రం సిరిసిల్లలో అభివృద్ధి ఏం లేదని అంటున్నారు' అని మంత్రి కేటీఆర్ విమర్శించారు.

' కేసీఆర్ న్యాయకత్వం మానేరును సజీవ ధారగా మార్చింది అని మంత్రి కేటీఆర్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సిరిసిల్లలో వర్కర్ టు ఓనర్ పథకాన్ని తీసుకొస్తున్నాం..



సంక్షేమం అభివృద్ధి అన్ని రంగాల్లో పురోభివృద్ధి ని సాదిస్తున్నాం.. కాంగ్రెస్ బీజెపీ వాళ్ళకు మాత్రమే అభివృద్ధి కనబడటంలేదు.. కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే ఓట్లు దండుకోవడానికే.. కుల, మతాల పేరుతో ముందుకు వస్తారని ఆయన మండిపడ్డారు. కులం, మతం కాదు గుణం చూసి ఓటెయ్యండి.. అభివృద్ధి నా కులం, సంక్షేమం నా మతం.. నేను పని చేస్తాను అనుకుంటేనే నాకు ఓటెయ్యండి.. సిరిసిల్ల చరిత్రలో మొదటి సారి 2014 సిరిసిల్ల ఎమ్మెల్యే కు మంత్రి పదవి వచ్చింది అని' మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.



# బీసీ ముఖ్యమంత్రి అధికారంలోకి వస్తే చాన్సిస్తాం

- అవి రెండూ కుటుంబ పార్టీలే..
- సోనియాకు రాహుల్‌ని ప్రధాని చేయాలనే ఆలోచన
- కేసీఆర్‌కు కేటీఆర్‌ను సీఎం సీట్లో కూర్చోబెట్టాలని ఆశ
- మోదీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం
- సూర్యాపేట సభలో అమిత్ షా

తెలంగాణాలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వర్గానికి చెందిన వ్యక్తినేముఖ్యమంత్రి చేస్తామని బీజేపీ అగ్రనేత , కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం సూర్యాపేటలో నిర్వహించిన బీజేపీ జన గర్జన సభలో ప్రసంగిస్తూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్ బీసీలకు చేసిందేమి లేదంటూ విమర్శించారు.. కాంగ్రెస్ వల్ల దేశం సర్వం దోపిడికి గురైతే, బిఆర్ఎస్ వల్ల తెలంగాణసర్వనాశనం అయిందని మండిపడ్డారు.. రెండు పార్టీలు అభివృద్ధికి నిరోధకలని పేర్కొన్నారు.. కాంగ్రెస్ పార్టీ రాహుల్ ను ప్రధానిని చేయాలని అలోచిస్తుంటే, కెటిఆర్ను రాష్ట్ర ముఖ్యమంత్రిని చేయాలని ఎత్తులు వేస్తున్నారని అమిత్ ఆరోపిచారు.. ఆ రెండు పార్టీలు కుటుంబ పార్టీలు కావడం వల్లే స్వంత కుటుంబ అభివృద్దే తప్ప ప్రజలకు ఎటువంటి అభివృద్ధి పనులు చేయరంటూ విమర్శలు గుప్పించారు. ప్రధాని మోడీ నాయకత్వంలో మాత్రమే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ''కేటీఆర్‌ను సీఎంను చేయాలని కేసీఆర్ ఆలోచిస్తుంటారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలని సోనియాగాంధీ చూస్తుంటారు. కేసీఆర్, సోనియాకు వాళ్ల కుటుంబం మాత్రమే ముఖ్యం. వారసులను పదవుల్లో కూర్చోబెట్టడమే భారాస, కాంగ్రెస్ లక్ష్యం. భాజపా మాత్రమే పేదల సంక్షేమం గురించి ఆలోచిస్తుంది. భారాస.. పేదల వ్యతిరేక పార్టీ, దళితుల వ్యతిరేక పార్టీ. కేసీఆర్ మరోసారి గెలిస్తేనైనా దళితుడిని సీఎంగా చేస్తారా? దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్న హామీ ఏమైందో కేసీఆర్ చెప్పాలి. రూ.50వేల కోట్లతో దళితుల అభివృద్ధి నిధి ఏమైందో చెప్పాలి. రూ.10వేల కోట్లతో బీసీ సంక్షేమ కార్యక్రమాలు అన్నారు.. ఏం చేశారో చెప్పాలి. బీసీల సంక్షేమం కోసం ప్రధాని మోడీ రాజ్యాంగ బద్ధంగా బీసీ కమిషన్ ఏర్పాటు చేశారు. సమ్మక్క సారక్క పేరుతో ములుగు జిల్లాలో గిరిజన వర్సిటీ ఏర్పాటు చేస్తాం. పసుపు రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నాం. కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులు కాపాడేందుకు మోడీ ముందుకు వచ్చారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చేందుకు ట్రైబ్యునల్ ఏర్పాటు చేశారు'' అని అమిత్ షా తెలిపారు.

## పోలీసులమంటూ తనిఖీలు

### రూ. 18 లక్షలతో ఉడాయించిన కేటుగాళ్లు

తెలంగాణలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి రాష్ట్రం మొత్తం రాజకీయంగా వేడెక్కింది. పార్టీలన్నీ తమతమ ప్రచారంలో దూసుకుపోతున్నాయి. అదేవిధంగా ఎన్నికల సంఘం కూడా తమ విధులను పకడ్బందీగా నిర్వర్తిస్తోంది. ఎక్కడకక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తోంది. పోలీసులు కూడా వివిధ మార్గాల్లో రోజూ చెక్ పాయింట్లు ఏర్పాటుచేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. పోలీసుల తనిఖీల్లో నిత్యం కోట్లలో డబ్బులు దొరుకుతున్నాయి. అయితే ఈ తనిఖీలను తమకు అనుకూలంగా మార్చుకొని.. ఇద్దరు దొంగలు భారీ లూటీ చేశారు. బేగంబజార్ కి చెందిన ఓ వ్యాపారి పంజాగుట్ట నుంచి వస్తుండగా.. ఇద్దరు పోలీసులు వచ్చి బండి ఆపారు. తనిఖీలు చేయాలంటూ బండి, బ్యాగులు చెక్ చేశారు. ఆయన బ్యాగులో ఉన్న రూ. 18 లక్షల చూశారు. ఆ డబ్బుకు రశీదులు చూపించాలని అడిగారు. తన వద్ద రశీదులు లేవని వ్యాపారి చెప్పడంతో.. స్టేషన్ కు రావాలని చెప్పి పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కాసేపటికి పంజాగుట్ట స్టేషన్ కు చేరుకున్న వ్యాపారి.. జరిగిన తనిఖీల గురించి ఆరా తీశాడు. అయితే తాము ఎక్కడా తనిఖీలు చేయలేదని పోలీసులు చెప్పడంతో.. వ్యాపారం కంగుతిన్నాడు. ఇద్దరు వ్యక్తులు వచ్చి.. పోలీసులమని చెప్పి, తన వద్ద ఉన్న రూ. 18 లక్షలను తీసుకొని వెళ్లారని చెప్పాడు. వ్యాపారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆ నకిలీ పోలీసుల కోసం గాలింపు చేపట్టారు.

# బైనాక్యులర్ వార్

### ఎన్నికల సంఘంపై వైఎస్ షర్మిల అసంతృప్తి

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ షర్మిల నేతృత్వంలోని వైఎస్సార్ తెలంగాణ పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ఉమ్మడి గుర్తును కేటాయించింది. తెలంగాణ రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో ఆ పార్టీకి బైనాక్యులర్ గుర్తును కేటాయిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. అయితే.. వైఎస్సార్ తెలంగాణ పార్టీకి బైనాక్యులర్ గుర్తును కేటాయిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేయడంపై వైఎస్ షర్మిల అసంతృప్తిని వ్యక్తం చేశారు.

కేంద్ర ఎన్నికల సంఘం తమ పార్టీకి బైనాక్యులర్ గుర్తును కేటాయించడంపై వైఎస్సార్టిపి పార్టీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మరో గుర్తు కేటాయించాలని ఆ పార్టీ అధినేత్రి షర్మిల సీఈసీని ఆశ్రయించారు.



నాకు బైనాక్యులర్ గుర్తు వద్దంటూ షర్మిల స్పష్టం చేశారు. మరి దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం ఎలా స్పందిస్తుందో చూడాలి. అయితే షర్మిల కామెంట్స్ పై నెటిజన్స్ ఫన్ని ట్రోల్స్ చేస్తున్నారు. పార్టీ గుర్తు ఏదైతే ఏంటీ.. తెలంగాణలో ఆమెకి కనీసం డిపాజిట్ అయినా వస్తుందా అని ప్రశ్నిస్తున్నారు.

## ఇంటర్ వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలు రిలీజ్

- 2 వేల ఆలస్య రుసుముతో.. డిసెంబర్ 20 వరకు గడువు

**హైదరాబాద్ ,ఆంధ్రప్రభ:** ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం కోర్సులకు సంబంధించి వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను ఇంటర్మీడియట్ బోర్డు గురువారం విడుదల చేసింది. వార్షిక పరీక్షలు వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించనున్న నేపథ్యంలో విద్యార్థుల నుంచి ఫీజు స్వీకరించాలని ఆయా జూనియర్ కళాశాలలకు బోర్డు ఆదేశాలు జారీ చేసింది. ఆలస్య రుసుంతో డిసెంబర్ 20 వరకు అవకాశం కల్పించింది. ఈ నెల 26వ తేదీ నుంచి నవంబర్ 14వ తేదీ వరకు విద్యార్థులు ఫీజు చెల్లించాలని సూచించింది. రూ.100 ఆలస్య రుసుంతో నవంబర్ 16 నుంచి 23వ తేదీ వరకు, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు రూ. 500 ఆలస్య రుసుంతో, డిసెంబర్ 6 నుంచి 13 వరకు రూ. 1000 ఆలస్య రుసుంతో, డిసెంబర్ 15 నుంచి 20వ తేదీ వరకు రూ. 2 వేల ఆలస్య రుసుంతో ఫీజు చెల్లించేందుకు అధికారులు అవకాశం కల్పించారు. ఫస్టియర్ రెగ్యులర్ విద్యార్థులు రూ.510, ఒకేషనల్ రెగ్యులర్ విద్యార్థులు రూ.730, సెకండియర్ ఆర్ట్స్ విద్యార్థులు రూ. 510, సైన్స్, ఒకేషనల్ విద్యార్థులు రూ. 730 చొప్పున ఫీజు చెల్లించాలని అధికారులు పేర్కొన్నారు.



# నన్ను చంపేస్తారేమో?


## కుట్ర జరుగుతోంది

- ఏసీబీ కోర్టుకు చంద్రబాబు లేఖ
- పోలీసులకు తెలిపినా పట్టించుకోలేదు



**రేణిగుంట (ప్రభ న్యూస్) :** తనను అంతమొందించేందుకు వామపక్ష తీవ్రవాదులు కుట్ర పన్నుతున్నారని టీడీపీ అధినేత చంద్రబాబు ఆరోపించారు.. ఈ మేరకు ఏసీబీ కోర్టు జడ్జికి లేఖ పంపారు. తన భద్రత, ఆరోగ్యంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆయన 3 పేజీల లేఖ రాశారు. ఈ నెల 25న రాసిన లేఖను జైలు అధికారుల ద్వారా జడ్జికి పంపారు. ''నేను జైలుకు వచ్చినప్పుడు అనధికారికంగా వీడియోలు, ఫొటోలు తీశారు. నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ తరహా వీడియో ఫుటేజ్ రిలీజ్ చేశారు. నన్ను అంతమొందించేందుకు వామపక్ష తీవ్రవాదులు కుట్ర పన్నుతున్నారు. కుట్రపై తూర్పుగోదావరి జిల్లా ఎస్పీకి లేఖ కూడా వచ్చింది. ఆ లేఖపై ఇప్పటి వరకు పోలీసు అధికారులు ఎలాంటి విచారణ చేపట్టలేదు''అని చంద్రబాబు తన లేఖలో పేర్కొన్నారు. తన భద్రతపై అనేక అనుమానాలున్నాయని, వాటిని పరిశీలించాలని చంద్రబాబు కోరారు.

# భువనేశ్వరి పరామర్శ.. నేడు ఆఖరు!



**రేణిగుంట (ప్రభ న్యూస్) :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఎర్రమరెడ్డిపాలెంలోని సూరా మునిరత్నమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారా భువనేశ్వరి చేపట్టిన 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మూడవరోజు మండలంలోని ఎర్రమరెడ్డి పాలెం గ్రామంలోని సూరా ముని రత్నమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. సూరా ముని రత్నమ్మ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ జాతీయ నాయకులు రవి, శ్రీధర్ వర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, ప్రముఖ న్యాయవాది ఉదయ్ కుమార్ రెడ్డి, వెంకటాపురం మాజీ ఎంపీటీసీ గజేంద్ర రెడ్డి, మండల ఎస్సీ ఎస్టీ సెల్ నాయకులు నెల్లూరు సుబ్రమణ్యం, కొరియర్ రవి, మాజీ ఎంపీటీసీ బుజ్జి నాయుడు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

